




## (గత సంచిక తరువాయి)

12

**సమయం** సరిగ్గా మూడు. తెలుగు మాష్టారు క్లాసు అవుతోంది. ఆవిడ పేరు శాంత. నూనె రాసుకున్న జుట్టు నున్నగా దువ్వి, జడ అల్లుకుంది. పొడుగాటి జడ. నల్లని తాచుపాము వీపుమీద పాకుతున్నట్టు ఉంటుంది. తెల్లని తెలుపు, సన్నగా, పొడుగ్గా ఉంటుంది. కంటినిండా కాటుక పెట్టుకోడంతో మొహంలో కొంచెం కళ ఉంటుంది కానీ, ఆ కాటుక లేకపోతే మొహం పాలిపోయినట్టు ఉంటుంది. కానీ స్వరం చాలా మధురంగా ఉంటుంది. ఎంత సేపు విన్నా, ఇంకా వినాలని అనిపిస్తుంది. కాకపోతే, పవిత్ర మనసంతా శివ నిండిపోడంతో ఆవిడ స్వరం ఆమెకి కర్ణ కఠోరంగా వినిపిస్తోంది.

పవిత్ర మాటి,మాటికీ చేతి వాచీ చూస్తూ, అసహనంగా వింటోంది. "ఈవిడ ఒక పట్టాన వదిలేలా లేదు" అంది గుసగుసగా నాగలక్ష్మి తో.

"ఏంటే తొందర? అప్పుడే వచ్చేసాడా? అయినా రోజూ అలా తిరిగితే ఎవరన్నా చూస్తే!"

"చూస్తే ఏం?" నిర్లక్ష్యంగా అంది పవిత్ర.

"ఏంటి? " కళ్ళు పెద్దవి చేసి చూసింది నాగలక్ష్మి .

"చూస్తే ఏం అంటున్నావా? ఏవిటే కొంపతీసి పెళ్లి చేసేసుకున్నారా? ఏది చూడనీ" పవిత్ర మెడలో ఉన్న గొలుసు జాకెట్ లో నుంచి బయటకి లాగి చూసింది.

"ఇంకా తాళి, గీళి లేదుగా ఏంటి అంత ధైర్యం? "

వాళ్ళిద్దరి మధ్యా సాగుతున్న గుసగుసల సవ్వడికి ముందు సీటులో ఉన్న శ్రీదేవి తలతిప్పి చూసింది.

"ఏయ్ ఏంటే చూస్తున్నావు? అటు తిరుగు"పళ్ళు బిగపట్టి అరిచింది పవిత్ర.

"మీరంతా రేపు నేనడిగే ప్రశ్నల కు సరైన సమాధానాలు చెప్పాలి".

ఖంగుమని మాష్టారు స్వరం మోగడంతో పవిత్ర పుస్తకాలు బాగులో సర్దేసుకుంది. ఆవిడ టేబుల్ మీద ఉన్న నోట్ బుక్ తీసుకుని బాగ్ లో పెట్టుకుని వెళ్ళిపోయింది.

ఆవిడ గుమ్మం దాటగానే చివుక్కున లేచి, నాగలక్ష్మి, శ్రీదేవి పిలుస్తున్నా వినిపించుకోకుండా పరిగెత్తింది పవిత్ర.

ఈ పాటికి వచ్చి తనకోసం ఎదురుచూస్తూ ఉంటాడు. ఒక డాక్టర్ కోసం ఎంతో మంది రోగులు ఎదురుచూస్తారు. కానీ అతను మాత్రం తనకోసంఎదురు చూస్తాడు. ఈ ఫీలింగ్ ఎంత బాగుంది?

కారు ఆపుకుని కూర్చుని స్టీరింగ్ మీద చేతి వ్రేళ్ళతో సున్నితంగా దరువు వేస్తున్న శివ ఆమె కళ్ళ ముందు మెదిలాడు. బలంగా ఎంత బాగుంటాయి ఆ వ్రేళ్ళు. షర్ట్ చేతులు వెనక్కి మడిచి పెట్టుకుంటే, అక్కడక్కడా రోమాలతో తెల్లని ఆ చేతులు ఎంత అందంగా ఉంటాయి. ఆ చేతుల్లో నలిగిపోవాలని, అతనిలో ఐక్యం అయిపోవాలని ఆమె హృదయం తహతహలాడసాగింది. అతను భర్త అయితే, ఈ జీవితం సార్ధకం అయిపోతుంది. ఎంత త్వరగా ఆ రోజు వస్తుందో?

వడి,వడిగా గేటు దాటుతున్న పవిత్ర కాళ్ళు ఠక్కున ఆగిపోయాయి. ఎదురుగా నిలువెత్తు విగ్రహం. అరచేతులు, అరికాళ్ళల్లో చెమట పట్టేసింది క్షణాల్లో ఏనాడూ కాలేజి గేటు ముందు నుంచి కూడా వెళ్ళని నాన్న గేటు లోపలికి ఎందుకు వస్తున్నాడు?

"కాలేజ్ అయిపోయిందా?" మృదువుగా అడిగాడు మాధవ .

"ఆ ... అదీ... " కొంచెం ఎడంగా చెట్టుకింద కారాపి కూర్చుని తన రాకకోసం గేటు వైపు చూస్తున్న శివవైపు, తండ్రివైపు బిత్తరచూపులు చూసింది.

" క్లాసులు పోతాయని భయమా? ఒకటో, రెండో క్లాసులు ఎగ్గొడితే పర్లేదులేమ్మా... పద వెళదాం" అన్నాడు చాలా మృదువుగా శాంతంగా.

"ఎ... ఎక్కడికి నాన్నా?" అప్రయతంగా అడిగింది.

"నీకు ఎక్కడికి వెళ్ళాలి అనిపిస్తే అక్కడికి" నవ్వాడు.

ఆశ్చర్యంగా తండ్రి మొహంలోకి చూసింది.

ఆయన మొహంలో ఎలాంటి భావం లేదు. ప్రశాంతంగా నవ్వుతున్నాడు.

దూరం నుంచి ఇదంతా గమనిస్తున్న శివ హటాత్తుగా కారు దిగి వాళ్ళవైపు వచ్చాడు. పవిత్రకి ఒళ్ళంతా చెమటతో తడిసిపోతోంది. గుండె దడదడలాడుతోంది.

ఎన్నడూ లేనిది నాన్న ధోరణి వింతగా ఉందేంటి? తెలిసిపోయిందా నాన్నకి తన గురించి, శివ గురించి అంతా తెలిసిపోయిందా? హటాత్తుగా ఎందుకు వచ్చినట్టు? పైగా ఏనాడూ కాలేజ్ గేటు వైపు కూడా రాని నాన్న, ఇవాళ, ఈ సమయంలో ఎలా వచ్చారు? ఎందుకు వచ్చారు? ఆమె మనసులో లక్ష ప్రశ్నలు తరుముకొస్తున్నాయి.

శివ దగ్గరగా వచ్చాడు. పవిత్రకి గుండె చప్పుడు వేగంగా పెద్దగా వినిపిస్తున్నట్టు ఉంది.

అతను వస్తూనే మాధవ కి షేక్ హ్యాండ్ ఇచ్చి "హలో సర్. ఎలా ఉన్నారు? ఏంటి ఇక్కడ ఉన్నారు? anything wrong? పవిత్రా! నాన్నగారు కాలేజ్ కి వచ్చారేంటి? నువ్వు బానే ఉన్నావా? " అంటూ గబగబా ప్రశ్నలు వేసాడు.

మాధవ అతని మొహంలోకి సూటిగా చూస్తూ "మీరేంటి డాక్టర్ ఇటు వైపు వచ్చారు. ఇవాళ హాస్పిటల్ కి వెళ్ళలేదా?" అనడిగాడు.

ఆయన ప్రశ్నకి కొంచెం కలవరపడి సర్దుకుని నవ్వుతూ, "ఇవాళ కేసులేం లేవండి. ఇటువైపు పనుండి వెళ్తూ మిమ్మల్ని చూసి కారాపాను" అన్నాడు.

"ఓ అలాగా? అయితే మీరూ రండి అలా అరటి తోట వైపు షికారుకి వెళ్దాం." అన్నాడు మాధవ.

శివ పవిత్రవైపు చూసాడు. అప్పుడే ఆమె అతని వైపు చూసింది. ఇద్దరి కళ్ళు కలుసుకున్నాయి. ఆ నాలుగు కళ్ళల్లో ఒకే భావం "ఈయనకి అకస్మాత్తుగా ఏమైంది? అరటి తోట అంటాడేమిటి? సమయం, సందర్భం లేకుండా. మిట్ట మధ్యాహ్నం. సరదాగా చల్లబడ్డాక అలా వాకింగ్ కి వెళ్ళడం అలవాటే ఆయనకి. వెళ్తే, కార్తీకమాసంలో వన భోజనాలకు అని కుటుంబంతో, స్నేహితులతో వెళ్తారు. లేకపోతే ఒక్కడే వెళ్తాడు. ఇప్పుడు ఏమైంది ఈయనకి?

మాధవ హడావుడి పెడుతూ "రామ్మా మనం మన కారులో వెళ్దాము. డాక్టర్ గారు మన వెనకాల వస్తారు. పోనీ నువ్వు ఆయన కారులో వస్తావా కబుర్లు చెప్పుకుంటూ." అన్నాడు.

"నేనా? లేదు, లేదు నీతోటే వస్తా" కంగారుగా అంది పవిత్ర.

"సరే రా... మీరు మమ్మల్ని ఫాలో అవండి డాక్టర్ గారూ" అంటూ కారు దగ్గరకి నడిచాడు. పవిత్ర, శివ వైపు చూసి, తల దించుకుని తండ్రిని అనుసరించింది. శివ కొన్ని క్షణాలు సాలోచనగా అక్కడే నిలబడి, మాధవ కారు స్టార్ట్ చేయగానే తన కారువైపు నడిచాడు.

కారు నేరుగా శివ ఇంటి ముందు ఆపాడు మాధవ. వెనకాలే వచ్చిన శివ, మాధవ పక్కన కూర్చున్న పవిత్రా అదిరిపడ్డారు.

మాధవ కారు దిగి చుట్టూ తిరిగి వచ్చి, పవిత్ర కూర్చున్న వైపు డోర్ తీసి పట్టుకుని "దిగు" అన్నాడు.

"ఇక్కడా? అరటి తోట అన్నావుగా" అంది అయోమయంగా.

"పనుంది దిగు" అని కూతురుతో అని, వెనక్కి తిరిగి అప్పుడే కారు దిగుతున్న శివతో అన్నాడు "మీరు పిలవకుండా వచ్చేస్తున్నాను అనుకోని అతిథిలా. మీరేం అనుకోరుగా"

శివ ఆయన ఆంతర్యం తెలుసుకోడానికి ప్రయత్నిస్తూనే చిరునవ్వుతో "అదేం లేదు. మీకు ఎప్పుడూ మా క్లినిక్ స్వాగతం పలుకుతుంది" అన్నాడు.

ముందు నడిస్తే ఆ ఇల్లు, పరిసరాలు తనకి చిరపరిచితం అని తండ్రి గమనిస్తాడేమో అనుకుంటూ బెదురు, బెదురుగా అడుగులో అడుగు వేస్తూ తండ్రి వెనకాల నడవసాగింది పవిత్ర.

శివ కారు చూడగానే వాచ్మాన్ పరిగెత్తుకుని వచ్చి తాళాలు తీసాడు. శివ రెండంగల్లో లోపలికి వెళ్ళాడు.

కొద్దిగా వంగి కుడిచేయి చాచి మాధవకి చూపిస్తూ "రండి సార్" అన్నాడు.

మాధవ, ఆయన వెనకాల పవిత్ర లోపలకి అడుగుపెట్టారు. వాచ్ మాన్ పవిత్ర వైపు చూసి నమస్కరించి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. మాధవ గమనించీ గమనించనట్టు ఉండిపోయి, హాలు మొత్తం కలయచూస్తూ "ఒక్కరే ఉంటారా? మీ అమ్మా, నాన్నా,.." అర్ధోక్తి లో ఆగిపోయాడు.

వినయంగా అన్నాడు శివ. "నాకు అమ్మ నాన్న లేరండి. పిన్ని బాబాయ్ దగ్గర పెరిగాను. బాబాయ్ డాక్టర్. అందుకే నన్నూ మెడిసిన్ చదివించాడు."

"బాబాయ్ అంటే!"

"మా నాన్నగారి తమ్ముడు"

"ఓహో..." ఆయన చూపులు ఎదురుగా ఉన్న క్లినిక్ డోర్ వైపు తిరిగాయి.

శివ, పవిత్ర వైపు చూసి, కళ్ళతో సైగ చేసాడు "ఏమిటి" అన్నట్టు.

"ఏమో! " అన్నట్టు చూసింది పవిత్ర.

అప్పుడే ఆయన శివ వైపు చూస్తూ "అది మీ క్లినిక్కా" అని అడిగాడు.

కొంచెం ఉలిక్కిపడి సర్దుకుంటూ "అ... అవును " అన్నాడు శివ.

"టైమింగ్స్ ఏమిటి? "

అతను నొసలు చిట్లించాడు. ఈయనకి నా క్లినిక్ టైమింగ్ తో ఏం పని అని ఆలోచిస్తూ అన్నాడు."ప్రత్యేకంగా నేను టైం పెట్టుకోలేదు. హాస్పిటల్ లో కేసులు ఎక్కువ లేకపోతే క్లినిక్ ఓపెన్ చేస్తాను."

"అలా ఎలా? మీరు ఎప్పుడు ఉంటారో రోగులకు ఎలా తెలుస్తుంది?"

అతనేం మాట్లాడలేదు.

"డాక్టర్ గారూ? మీకు పెళ్లి అవలేదు కదా!"

"లేదు"ఆయన తన పెళ్లి ప్రస్తావన ఎందుకు తీసుకువచ్చాడో కారణం తెలియని శివ అభావంగా చెప్పాడు.

"మా అమ్మాయిని పెళ్లి చేసుకుంటారా?"

శివ, పవిత్ర ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. చూస్తూ ఉండగానే వాళ్ళ ఇద్దరి కళ్ళల్లో వెలుగు మెల్లగా, వెన్నెల పరుచుకున్నట్టు మొహమంతా పరుచుకుంది.

"అంతకన్నానా? నేను అడగాలి అనుకున్నాను. మీరే తెచ్చారు ప్రస్తావన." అన్నాడు.

"అయితే, మీ పిన్ని, బాబాయిలను పిలిపించండి వెంటనే" అని చెప్పి, కూతురు వైపు చూసాడు. పవిత్ర అరచేతుల్లో రేఖలు చూసుకుంటూ కూర్చుంది.

"వెళ్దామా పవిత్రా?" మాధవ గొంతు విని గబుక్కున లేచింది.

శివ వైపు చూసి, "ఎక్కడి నుంచి రావాలి వాళ్ళు?" అనడిగాడు.

"హైదరాబాద్"

"సరే. రేపే బయలుదేరమని చెప్పండి."

లేచి నిలబడి గుమ్మం వైపు నడిచాడు. పవిత్ర అలాగే నిలబడిపోయింది. ఆమెకి అక్కడ నుంచి కదలాలని లేదు. తండ్రి నోటి నుంచి తన ప్రేమకి అంగీకారం తెలుపుతున్నట్టు, పెళ్లి ప్రస్తావన విన్నాక, గబుక్కున శివని కౌగలించుకుని, గిర్రున తిరగాలనిపిస్తోంది.

మాధవ వెనక్కి తిరిగి "రామ్మా " అన్నాడు.

తడబాటుగా అటూ, ఇటూ చూసి, తండ్రి వెళ్ళిన వైపు వెళ్ళిపోయింది. గుమ్మం బయట నుంచి కొద్దిగా తలతిప్పి ఓరగా శివ వైపు చూసి, అతని పెదవుల మీద, కళ్ళల్లో చిందులు వేస్తున్న అల్లరినవ్వు చూసి గుండెలు జల్లుమనగా వేగంగా నాలుగు మెట్లు దిగి గేటు వైపు వెళ్ళిపోయింది.

వెలిగిపోతున్న మొహంతో పవిత్ర, ఎన్నడూ చూడనంత గంభీరంగా మాధవ ఇంట్లో అడుగుపెట్టారు.

పవిత్ర నాంచారమ్మ వైపు వేగంగా వెళ్లి ఆమె ఒళ్లో వాలిపోయి, గారంగా అంది "నానమ్మా ఆకలేస్తోంది".

మామూలుగా అయితే, అలా వచ్చినపుడు, ఆవిడ పవిత్రని దగ్గరకు తీసుకుని "నా తల్లే, నా తల్లే, ఇప్పుడే అన్నం కలిపి తెస్తాను. వెళ్లి బట్టలు మార్చుకుని రా" అనేది. కానీ, ఇవాళ మోహన్ చెప్పిన విషయం విన్న దగ్గర నుంచి, ఆవిడ మనసు, మనసులో లేదు. ఎంతో పద్ధతిగా పెరుగుతోంది అనుకున్న మనవరాలు, ఎవరినో ప్రేమించడం ఏంటి? కాలేజి ఎగ్గొట్టి అతనితో తిరగడం ఏమిటి? ఇదంతా నిజమేనా? ఎలా జరిగింది ఇదంతా అనే ప్రశ్నలు ఆవిడ మనసులో గింగుర్లు తిరుగుతున్నాయి. చాలా అశాంతిగా ఉంది. అందుకే మనస్ఫూర్తిగా ఆ పిల్లని దగ్గరకు తీసుకోలేకపోయింది. వీపు మీద చేయి వేసి, అన్యమనస్కంగా నిమురుతూ, కొడుకు వైపు చూసింది.

మాధవ షర్టు విప్పి వర్దని చేతికి ఇస్తూ, "ప్రేమలో పడిన వాళ్లకి ఆకలి,దప్పులు ఉండవు. నీకు ఆకలివేయడం ఏమిటమ్మా?" అన్నాడు.

ఆ మాటల్లో వినిపించిన హేళనకి పవిత్ర దిగ్గున ఆవిడ ఒళ్లో నుంచి లేచి, తండ్రి వైపు నిర్ఘాంతపోయి చూసింది.

"ఏం అలా చూస్తున్నావు? పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగుతూ లోకం తనని చూడడం లేదు అనుకుంటుంది. కానీ పాలు నేలపాలు కాకుండా కొన్ని జతల కళ్ళు పిల్లిని గమనిస్తూనే ఉంటాయి. దాన్ని జాగ్రత్త అంటారు. నువ్వు అదే పని చేసావు. నీ వయసు నిన్ను ఆకర్షణలో పడేసింది. ప్రేమ అనే వ్యామోహంలో నీకు అమ్మ,నాన్న, నానమ్మ ఎవరూ గుర్తురాలేదు, ఈ ఇంటి పరువు, నా ప్రతిష్ట నీకు గుర్తురాలేదు. నేను పని ఒత్తిడిలో ఉన్నానని, అమ్మ, నానమ్మ  ఎలాగా బయటకి రారు కదా నిన్ను గమనించరు అని ఒళ్ళు మరిచిపోయి తిరుగుతున్నావు. కానీ, ఈ చిన్న ఊళ్ళో ఎన్ని జతల కళ్ళు నిన్ను కనిపెట్టి ఉంటాయో, నీ కదలికలు లెక్కపెడతాయో నువ్వు ఊహించి ఉండవు.  మీ అమ్మ నిన్ను డాక్టర్ చేయాలి అనుకుంది... మీ నానమ్మ ఇంకా ఏదో గొప్పగా ఊహించుకుంది. నువ్వు అన్నీ కాలితో తన్ని,  ప్రేమ మోజులో పడి, చదువు కూడా నిర్లక్ష్యం చేస్తున్నావు. అందుకే నీకు పెళ్లి చేసేయాలని నిర్ణయించుకున్నాను. నీ ప్రేమని గౌరవించి కాదు, నీ విచ్చలవిడి తిరుగుడుకు కళ్ళెం వేయడానికి, నా ఇంటి పరువు కాపాడుకోడానికి. " అని పవిత్రతో అనేసి, వర్దని వైపు తిరిగి  "వర్దనీ రేపో, ఎల్లుండో పెళ్ళివారు వస్తారు. ప్రదానం ఏర్పాట్లు చేయి. " ఈ మాటలు అని, ఎటూ చూడకుండా తన గదిలోకి వెళ్ళిపోయాడు మాధవ.

చేష్టలుడిగి చూస్తున్న వర్దని, నాంచారమ్మ అతను అలా వెళ్ళగానే ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. వెంటనే ఇద్దరి చూపులు పవిత్ర వైపు తిరిగాయి. ఏం జరిగిందో, ఏం జరుగుతోందో అర్థం కాని దానిలా బొమ్మలా నిలబడిపోయింది పవిత్ర.

నాంచారమ్మ ఆ పిల్లని చూస్తూ తిరస్కారంగా అంది" ఏం పని చేసావే? ఇంత ప్రేమగా చూసుకున్న తల్లితండ్రులను ఇలా మోసం చేయడానికి సిగ్గులేదూ" .

"నేనేం చేసాను నానమ్మా?" అయోమయంగా అడిగింది పవిత్ర.

"ఇంకా ఏం చేయాలి? మేమంతా చచ్చామనుకున్నావా? నీ ఇష్టం వచ్చిన వాడిని వెతుక్కుని పెళ్లి చేసుకునే ఖర్మ నీకేంటి? మా కళ్ళల్లో కారం గొట్టి ఆ డాక్టర్ తో ఒళ్ళు మరిచిపోయి తిరుగుతావా? ఛ... ఆ పిల్లాడు చెప్పబట్టి ఇప్పటికైనా తెలిసింది. వాడు మంచివాడు కాబట్టి, మాకు చెప్పాడు. అదే ఊళ్ళో ప్రచారం చేసి ఉంటే ఏమయేది నీ గతి?" విసురుగా లోపలికి వెళ్ళిపోయింది వర్దని.

పవిత్రకి అర్థం అయింది. ఆ పిల్లాడు. అంటే ఇంకెవరు? వాడే... ఆ వెధవ. ఆమె అణువణువూ దహించుకుపోయింది. ఎంత కుళ్ళు వెధవ ! నా వాళ్ళలో నన్ను దోషిని చేస్తాడా? చూస్తాను... వాడిని... పళ్ళు పట,పట కొరుకుతూ నాంచారమ్మ తో అంది " ఏంటి నానమ్మా నేనేదో తప్పు చేసినట్టు అందరూ నన్ను తిడతారు. నేనేం దారిన పోయే వాడిని ప్రేమించానా? అతను డాక్టర్. ఆ వెధవ నల్ల కాకి నా వెంట పడి నన్ను ప్రేమించానని చెప్పడం బాగుందా? వాడేదో చెబితే మీరు నమ్మేస్తారా?"

"నమ్మక ఏం చేస్తారు? కళ్ళముందు కనిపిస్తుంటే నమ్మక ఏం చేయాలి? నమ్మాడు కాబట్టి నీ పెళ్ళికి ఏర్పాట్లు చేస్తున్నాడు మీ నాన్న. చేసుకో... ఇరవై ఏళ్ళు కూడా రాకుండా పెళ్లి చేసుకుని, ముప్పై ఏళ్ళు వచ్చేసరికి నలుగురు పిల్లల తల్లి అయి, ముసలిదానివి అవు. నీ మొహాన అలా రాసి ఉంటే ఎవరేం చేయగలరు?" నాంచారమ్మ నడుమున దోపుకున్న కొంగు తీసి, దులుపుకుంటూ పెరటి వైపు వెళ్ళిపోయింది.

గుండె రగిలిపోతుంటే, నిప్పుల మీద నడుస్తున్నట్టుగా నెమ్మదిగా తన గదివైపు నడుస్తూ అనుకుంది పవిత్ర"ఒరేయ్ మోహన్! చూడు నిన్నేం చేస్తానో".

మాధవ చెప్పినట్టే, మరునాడు సాయంత్రానికి శివ తన పిన్ని, బాబాయ్ ని పిలిపించాడు.

వాళ్ళు వచ్చిన మరునాడు, వర్దని, మాధవల ఇంట్లో పెళ్లి సందడి మొదలైంది.

నిశ్చయ తాంబూలాలు తీసుకోడానికి ఏర్పాట్లు మొదలైనాయి.

పూల గంపలు, పండ్ల గంపలు, మిఠాయిలు ఆ ఇంట్లోకి వెళ్తూ ఉంటే, తన బాల్కనీ లో నిలబడి పగిలిన గుండె నుంచి కారుతున్న రక్తం కళ్ళ నుంచి స్రవిస్తుంటే, కాలిపోతున్న కలలను ఆ రక్తంతో చల్లార్చడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు మోహన్.

గోధుమరంగు జరీ అంచు చీర కట్టుకుని, పొడుగాటి జడలో మల్లెల దండ పెట్టుకుని, రాళ్ళ నెక్లెస్ ధగధగలు, పండిన కలల మిలమిలలు పరిసరాలను పరవశింపచేస్తుంటే సిగ్గు తెరల మధ్య సోఫాలో ముడుచుకుని కూర్చుంది ముగ్ధ పవిత్ర.

ఎత్తుగా, ఎత్తుకు తగిన లావుతో చాలా ఆధునికంగా , అందంగా ఉంది శివ పిన్ని సరళాదేవి. ఆమెని చూస్తే యాభై ఏళ్ళు అని ఎవరూ అనుకోరు. ఆమె భర్త డాక్టర్ విశ్వప్రసాద్ కూడా ఆమెకి తగినట్టే అందంగా ఉన్నాడు. శివ సరళా దేవి పక్కన కూర్చుని కళ్ళతోటే పవిత్ర అందం తాగేస్తున్నాడు.

ఈ పెళ్లి చూపుల తతంగం లాంచనంగా జరిగి, నిశ్చయ తాంబూలాలు తీసుకుంటున్న ఆ శుభసందర్భాన్ని నిర్మలమైన మనసుతో స్వీకరించి ఆనందిస్తోంది వర్దని. నాంచారమ్మ కూడా అందమైన మనవరాలి పక్కన అందగాడు అయిన శివాని చూసి మురిసిపోతోంది. ఎంత చక్కని జంట. నా మనవరాలు తప్పు చేయలేదు అనుకుంది.

అయితే, అందరిలో మౌనంగా, గంభీరంగా తన మనసులో ఉన్న భావాలను ఏ మాత్రం పైకి ప్రదర్శించకుండా ఉన్నది మాధవ మాత్రమే.

పవిత్రకి సన్నిహితులు, శివ, పవిత్రల ప్రేమకి సాక్షులు అయిన, నాగలక్ష్మి , శ్రీదేవి, సత్యశ్రీ , భవాని పవిత్ర వెనకాల నిలబడి, ముసిముసి నవ్వులు నవ్వుతున్నారు.

ఆ ఆహ్లాదకరమైన, శుభసాయంత్రం,  రక్తం చిందుతున్న హృదయంతో పిట్టగోడ కింద కూర్చుని, వెక్కి, వెక్కి ఏడుస్తున్నాడు మోహన్.

కొడుకుని అలా చూస్తూ చాముండేశ్వరి కుమిలిపోతోంది. రెండురోజుల నుంచి అతను మంచినీళ్ళు కూడా తాగడం లేదు. ఇంట్లోంచి వెళ్ళిపొమ్మని తిట్టిన తండ్రి మొహం ఇంతవరకు చూడలేదు.  ఆ పిట్టగోడ దగ్గర నుంచి కదలడం లేదు. చాముండేశ్వరే బతిమాలి, బామాలి, మధ్య, మధ్య జ్యూసు, పాలు  బలవంతంగా కొడుకు నోట్లో పోస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటోంది.

పొరుగున  ఉన్న ఇంటితో అంతకాలం ఉన్న అనుబంధం ఒకే ఒక్క సంఘటనతో చెదిరిపోడంతో  ఆ ఇంట్లో జరుగుతున్న వేడుకలో వీళ్ళ భాగస్వామ్యం లేకపోవడం కూడా ఆవిడ హృదయాన్ని గాయం చేసింది. ఆ గాయానికి కారణం కొడుకే, అయినా మాతృహృదయం కొడుకుని నేరస్తుడిగా చూడలేకపోతోంది. ఈ దురదృష్టకరమైన పరిస్థితికి కారణం ఏమిటో తెలియని అయోమయంలో ఆవిడ కర్తవ్యం మరిచి, దిక్కులు చూస్తోంది.

మాధవ మాట్లాడడం మొదలుపెట్టాడు. “నాకు ఒక్కతే కూతురు. తన సుఖం , సంతోషం కోసం నేను ఈ పెళ్ళికి ఒప్పుకుంటున్నాను. మీ అబ్బాయికి, మా అమ్మాయికి ఏడేనిమిదేళ్ళు తేడా ఉంది. “

ఆయన మాట పూర్తి కాకుండానే అంది సరళా దేవి. “ఆ మాత్రం వయసు తేడా లేకపోతే ఎలాగండి? మా వారికి నాకు ఎనిమిదేళ్ళు తేడా. అయినా భర్త తనకన్నా పెద్దవాడు అయితేనే భార్య మీద ప్రేమ అనురాగంతో పాటు, కొంచెం గారం కూడా చేస్తాడు భర్త.”

ఆయన తల పంకించాడు. “భర్తకన్నా భార్య వయసు ఎక్కువ ఉంటేనే భర్త అనే పదానికి గౌరవం అనేది లభిస్తుంది. ఇది సహజం. అయితే, నా కూతురు చదువు పూర్తి చేయకముందే పెళ్లి చేయడం నాకిష్టం లేదు. కానీ తప్పదు కదా! ప్రేమ అనే వ్యామోహంలో పడింది.”

“దానిదేముంది? వ్యామోహం అని ఎందుకు అనుకుంటున్నారు? వాళ్ళది పవిత్రమైన ప్రేమ అనుకుంటే, మీ కూతురు తప్పు చేసింది అని మీరు అనుకోరు. అయినా, ఇప్పుడు ఇంక తప్పొప్పుల ప్రసక్తి ఏముంది?  పెళ్లి అయ్యాక తప్పు ఒప్పుగా మారిపోతుంది. “

మాధవకి ఆవిడ అలా తన ప్రతి మాటకీ అడ్డు వస్తూ ఏదో నచ్చ చెప్పడం చిరాకు అనిపించింది. అయినా తమాయించుకుని అన్నాడు. “భవిష్యత్తులో ఈ ఆస్తిలో సగం మా అమ్మాయికే కాబట్టి కట్నం అంటూ విడిగా నేనేమి ఇవ్వను”

“మా అబ్బాయి కట్నం అడిగాడా మిమ్మల్ని?” ఇప్పుడు శివ బాబాయ్ మొదటిసారి నోరు విప్పాడు.

“అడగలేదు. అడిగితే సమాధానం ఏమిటో ముందే చెప్తున్నా.”

“మీకలాంటి చింత వద్దు. మా వాడికి అన్నీ తెలుసు. వాడు డబ్బుకోసం కక్కుర్తి పడే మనిషి కాదు” అన్నాడు.

“సరే అయితే, నిశ్చయ తాంబూలాలు తీసుకుందామా?”

“తక్షణం తీసుకుందాం. మీ మాట కోసం ఎదురుచూస్తున్నాం. మీ అమ్మాయి మా ఇంట్లో ఎప్పుడు అడుగుపెడుతుందా అని ఎదురుచూస్తున్నాం” అంది సరళ.

మాధవ వర్ధని వైపు చూసాడు. పవిత్ర కళ్ళల్లో నక్షత్రాలు పూసాయి. తేనెటీగలు ఆమె పెదవులనే గులాబీపూలు అనుకున్నాయేమో తేనె ఒంపేసాయి ... చెంపల్లో కెంపులు మెరిసాయి.

క్షణాల్లో వర్ధని పెద్ద, పెద్ద వెండి పళ్ళాలలో పూలు, పండ్లు, మిఠాయిలు, పవిత్రకి శివకి కొత్త బట్టలు తీసుకుని వచ్చింది.

సరళాదేవి శివకి సైగ చేసింది. అతను ఆమె వైపు చూసి నవ్వాడు. ఆమె తన బాగ్ లో నుంచి మఖమల్ పర్స్ తీసింది. ప్రదానపు ఉంగరంతోపాటు, మావిడి పిందెల నెక్లస్, ఎరుపు రంగు బనారస్ చీర పవిత్రకి బొట్టుపెట్టి ఇచ్చింది సరళాదేవి.

ఆ ఎరుపు పవిత్ర మొహం నిండా ప్రతిఫలించింది. ఆనందం ఆర్ణవం అయింది.

మోహన్ వెక్కిళ్ళు సన్నాయి కాగా, అతని కన్నీరు, పన్నీరుగా మారి అందరి మీద చల్లగా శివ, పవిత్రల పెళ్ళికి ఇరుపక్షాల పెద్దలూ అంగీకారం తెలుపుతూ తాంబూలాలు మార్చుకున్నారు.

పవిత్ర గుండెల్లో మరుమల్లెలు విరిసి, పరిమళిస్తుంటే, మోహన్ మనసులో బడబాగ్నులు రగలసాగాయి.

ఇంక అక్కడ కూర్చోలేకపోయాడు. గబుక్కున లేచి పరిసరాలు కలయచూసాడు. చాముండేశ్వరి కనిపించలేదు.

తనని కంటికి రెప్పలా అనుక్షణం కనిపెట్టి ఉంటున్న తల్లి కొంచెం కనుమరుగు అవగానే గబగబా మెట్లు దిగి, గేటు తోసుకుంటూ బాణం లా రోడ్డు మీదకి పరిగెత్తాడు.

ఎక్కడికి వెళ్ళాలో లక్ష్యం లేనట్టు, కనిపించిన దారిలో పరిగెత్తి, పరిగెత్తి, మందపాడు రైల్వే స్టేషన్ చేరాడు. ఆయాసంతో బెంచీ మీద కూలబడ్డాడు. ఎదురుగా కూల్ డ్రింక్ షాప్ కనిపించింది. జేబులో డబ్బులు చూసుకున్నాడు. దాదాపు వేయి రూపాయల దాకా ఉన్నాయి. ఒక కూల్ డ్రింక్ తాగి ఏ రైలు వస్తే అది ఎక్కి ముందు ఈ ఊరు నుంచి పారిపోవాలి. ఇక్కడ ఉండి పవిత్ర పెళ్లి చూడలేడు... ఆమె మరొకరి భార్యగా వెళ్లిపోతుంటే తట్టుకుని బతకలేడు.

మోహన్ ఒక కూల్ డ్రింక్ బాటిల్ తీసుకుని, నెమ్మదిగా నడుస్తూ పవిత్ర, శివ కూర్చునే బెంచీ దగ్గరకు వచ్చాడు. కుడిచేత్తో బెంచీ మీద మెల్లగా తుడిచాడు. స్వర్ణకారుడు ఒక ఆభరణం తయారు చేసాక, అక్కడక్కడా బంగారు పొడి కనిపిస్తుంది... దైవం అనే స్వర్ణకారుడు తయారుచేసిన బంగారుబొమ్మ పవిత్ర కూర్చున్న ఈ బెంచీ మీద ఆమె శరీరం

తాలూకు పరిమళం ఎక్కడైనా అంటుకుని ఉండదూ... ఆ కాస్త పరిమళం గుండెల్లోకి పీల్చుకుని, శాశ్వతంగా భద్రపరచుకుంటే!

నెమ్మదిగా బెంచీ మీద కూర్చున్నాడు. పడవల రేవు మీద సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఎర్రగా, పెద్ద గ్లోబుగా మారి మేఘాల మధ్యకి కనుమరుగు అవుతున్నాడు. మోహన్ అలాగే నిశ్చలంగా కూర్చున్నాడు. వెళ్లిపోవాలి. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి. అవును  వెళ్లిపోవాలి... పవిత్ర పరాయిది అయిపోతుంది. ఒక దుర్మార్గుడి చేతిలో చిక్కుతుంది. అవును శివ దుర్మార్గుడు.

నిజానికి శివ చెడ్డవాడు అని అతనికి ఎవరూ చెప్పలేదు. కానీ ఎందుకో మోహన్ కి శివ ప్రవర్తన నచ్చలేదు. అతని నవ్వులో, అతని మాటల్లో ఏదో తేడా కనిపిస్తోంది. ముఖ్యంగా పవిత్ర విషయంలో.

ఇవాళ పవిత్ర, శివ ఇంత దగ్గరవడానికి కారణం తనేగా... ఎంతపని చేసావురా? బాధగా తనని తాను తిట్టుకున్నాడు.  మళ్ళీ దుఃఖం ముంచుకొచ్చింది.

క్రమంగా చీకట్లు ముసురుకున్నాయి.

మోహన్ నిశ్శబ్దంగా ఏడుస్తున్నాడు.

హఠాత్తుగా ఏదో అయింది. తల మీద భయంకరమైన దెబ్బ... ఒకటి, రెండు, మూడు... “అమ్మా” మోహన్ నోటి నుంచి ఆర్తనాదం వెలువడింది. అతని కళ్ళు మూతలు పడుతూ ఉండగా ఇద్దరు బలంగా ఉన్న వ్యక్తులు పట్టాలు దాటి పరుగు పెడుతూ ఉండడం కనిపించింది. అతని కళ్ళు మూతలు పడ్డాయి.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS